నిధుల సాధనే సమాధానం

- ప్రతిపక్షాలకు చెంపపెట్టు
- రూ.156 కోట్లతో నియోజకవర్గంలో చేపట్టనున్న అభివృద్ధి పనులు
- బీఆర్ఎస్ శ్రేణులు


కేసీఆర్, కేటీఆర్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పార్టీ శ్రేణులు

అనంతగిరి: ప్రతిపక్షాల మాటలకు సమాధానమే నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆనంద్ తెచ్చిన నిధులని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు అన్నారు. వికారాబాద్ పట్టణంలో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి రూ.96 కోట్లు, మున్సిపల్ అభివృద్ధికి రూ.60 కోట్లను ప్రభుత్వం విడుదల చేయడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత నిధులతో నెలరోజుల్లో అభివృద్ధి పనులు ప్రారంభించేలా ఎమ్మెల్యే తగిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. నిధులు తీసుకురావడంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ కృషి ఎంతో ఉందని, అందుకు మంత్రి సబితారెడ్డి సహకారం ఎనలేనిదని పేర్కొన్నారు.

గర్వకారణం..

వికారాబాద్ రైల్వే వంతెన సమస్య ఏళ్ల తరబడి ఉందని, గతంలో ఎవరు తీసుకురాని నిధులను ఎమ్మెల్యే తీసుకురావడం గర్వకారణమన్నారు. మున్సిపాలిటీ నిధులతో పట్టణంలోని 5 ప్రధాన రోడ్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, వార్డుల్లో అవసరమయిన సీసీరోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, లంకా లక్ష్మీకాంత్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, బుచ్చిబాబు గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు గోపాల్, కృష్ణారెడ్డి, అనంత్‌రెడ్డి, కిరణ్‌పటేల్, కొండేటి కృష్ణ, లంకా పుష్పలతారెడ్డి, పావనిరెడ్డి, మంజులరెడ్డి, రాజ్యలక్ష్మి, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలు వద్దు

- అభివృద్ధిపై దృష్టి సారించండి
- ఎమ్మెల్యే ఆనంద్‌కు కాంగ్రెస్ నాయకుల హితవు


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వికారాబాద్ అర్బన్: ఎమ్మెల్యే ఆనంద్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే కాంగ్రెస్ పార్టీ నాయకుల గడపలు తొక్కుతున్నారని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మా ఇంటికి వస్తూ తన అనుచరులతో ఫొటో తీయించి, తనే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఎమ్మెల్యే దిగజారుడు రాజకీయాల్లో భాగమనే విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఎమ్మెల్యేగా తన ఇంటికి రావడాన్ని స్వాగతిస్తున్నానని, కాని రహస్యంగా ఏవో మంతనాలు జరుపుతున్నట్లు అపోహలు సృష్టించడం ఆయన స్థాయికి ఏమాత్రం తగదన్నారు. రాజకీయంగా తనను బదనాం చేయడానికే ఈ ఫొటోలు తీయించి, ప్రచారం చేసినట్లు ఆరోపించారు. ఎమ్మెల్యే ఆనంద్.. రాజకీయ జిమ్మిక్కులు మానుకొని, మున్సిపాలిటీ అభివృద్ధికి చొరవ చూపాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రత్నారెడ్డి, వాహిద్ మియా, కన్సిలర్లు మురళి, వేణుగోపాల్ రెడ్డి, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌కు ఇంటర్ పునాది

- దురలవాట్లకు దూరంగా ఉండాలి
- ఎస్ఐ విఠల్‌రెడ్డి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ విఠల్‌రెడ్డి

మోమిన్‌పేట: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాబృందం చేత పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇంటర్ విద్యలోనే విద్యార్థులు తమ భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని, దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు బానిస కావొద్దని చెప్పారు. పిల్లల అక్రమ రవాణాతో మానవత్వం మంట గలుస్తుందని, బాల్య వివాహాల నిర్మూళనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. మహిళల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే 100కు డయల్ చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, కళాశాల ప్రన్సిపల్ చెన్నయ్య, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


రోడ్లపై వరద ప్రవాహం

వికారాబాద్‌లో భారీవర్షం

అనంతగిరి: వికారాబాద్‌లో సోమవారం రాత్రి భారీగా వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. ఒక్కసారిగా వాన దంచికొట్టడంతో ప్రజలు, ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. వర్షం తగ్గు ముఖం పట్టాక ఇళ్లకు బయలుదేరారు.


వరదలో పరుగులు తీస్తున్న వాహనాలు

సాహిత్య సాంస్కృతిక వేదిక ఏర్పాటు


నూతన కార్యవర్గం

కొడంగల్ రూరల్: కొడంగల్ కవులు, రచయితలు, తెలుగు భాషా పండితులు, భాషాభిమానులు, తెలుగు సాంస్కృతికరంగంలో అభిరుచి కలవారు ఏకమై నూతనంగా సాంస్కృతిక వేదిక ఏర్పాటు చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనంత సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

కార్యవర్గ సభ్యులు వీరే..

గౌరవ అధ్యక్షుడుగా రేగడిమైలారానికి చెందిన అంజిలప్ప, అధ్యక్షుడిగా మండలానికి చెందిన ఎరన్పల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నాందార్‌పూర్‌కు చెందిన మాసని వెంకటయ్య, సంయుక్త కార్యదర్శిగా నర్సింహులు, కార్యదర్శులుగా నర్సింగ్, మహేశ్ కుర్మ, కార్యవర్గ సభ్యులుగా లాలయ్య, వెంకటయ్య, మోహన్‌సింగ్, ఇందనూరు కృష్ణ, శ్రీనాథ్, రత్నకళ, మహిళా అధ్యక్షురాలిగా శైలజ, మహిళా కార్యదర్శిగా బనలక్ష్మి, మహిళా సంయుక్త కార్యదర్శిగా ఇందిర, సలహాదారులుగా మల్లయ్య, రాజారాం, పండరి, డా.పి.శివకుమార్‌సింగ్, గుంజవెంకటయ్య, సుధాకర్‌రావు, చంద్రప్ప, శీలాదేవి, పద్మ, అనురాధ ఎన్నికయ్యారు. వీరిని అనంత వేదిక కవులు, అవధాని మలుగు అంజయ్య, దోరవేటి చెన్నయ్య, మల్లారెడ్డి, ఆశీర్వాదం, మాలెల అంజిలయ్యగౌడ్, వడిచర్ల సత్యం అభినందించారు. టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, రాధాకృష్ణ ఉన్నారు.

ఓపీఎస్ సాధనే లక్ష్యం


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ గోవిందమ్మ తదితరులు

యాలాల: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని సాధించడమే తమ లక్ష్యమని పీఆర్‌టీయూ, టీపీయూఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, గాజుల వీరేశం అన్నారు. పాత పెన్షన్ విధానం రద్దు కోసం ఈ నెల 29న తాండూరులో చేపట్టనున్న సంకల్ప రథయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను తహసీల్దార్ గోవిందమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మాట్లాడారు. పాత పింఛన్ విధానం రద్దు కోసం చేపట్టిన రథయాత్రకు ఉద్యోగులు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ, టీపీయూఎస్ సంఘం నాయకులు యాదయ్యగౌడ్, వెంకటయ్య, శ్రీధర్, లక్ష్మీకాంత్, శ్రీశైలం, బస్వరాజ్, భరత్ తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొడంగల్ రూరల్: బండల ఎల్లమ్మ దేవాలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి డాక్టర్ మల్లారెడ్డి దేశ్‌ముఖ్ (బెంగళూరు) రూ.లక్ష, తలారి గోపాల్ వీఆర్ఏ రూ.20వేలను అయ్యప్ప సేవా సమితి సభ్యులకు విరాళంగా అందజేశారు.

సరిచూశాకే ఓటరు జాబితా

తహసీల్దార్ గోవిందమ్మ


బీఎల్వోలకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్

యాలాల: ఎటువంటి పొరపాట్లు లేకుండా చూసుకున్న తరువాతే ఓటరు జాబితాను సిద్ధం చేయాలని తహసీల్దార్ గోవిందమ్మ అన్నారు. సోమవారం మండల పరిషత్‌లో నిర్వహించిన బీఎల్వోల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని, చనిపోయినా వారి పేర్లను లిస్ట్ నుంచి తొలగించాలని చెప్పారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ సరిగ్గా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో అసెంబ్లీ లెవెల్ మాస్టర్స్ ట్రైనర్స్‌లు గాజుల వీరేశం, గాజుల బస్వరాజ్‌లు బీఎల్‌ఓలకు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ యాదయ్య, ఆర్ఐ నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

సాంకేతిక సమస్యను పరిష్కరించండి


లేబర్ కమిషనర్‌తో ప్రకాశ్ తదితరులు

పరిగి: లేబర్ కార్డు నమోదులో వస్తున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని స్టేట్ అడిషనల్ లేబర్ కమిషనర్ గంగాధర్‌ను సోమవారం జన్ సాహస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్ కోరారు. ఇటీవల లేబర్ బోర్డులో జరిగిన మార్పులు, బీఓడబ్ల్యూ నమోదులో వస్తున్న సాంకేతిక సమస్యల గురించి ఆయనకు వివరించి, వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఎంతోమంది కార్మికులు ఉన్నారని, ఈ సమస్య ద్వారా నమోదు ప్రక్రియకు ఇబ్బందులు తలెత్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, బ్రహ్మం పాల్గొన్నారు.

రాజకీయ అనుభవం లేని ఎమ్మెల్యే

బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య

అనంతగిరి: వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్.. పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులను, పార్టీ కోసం పనిచేసిన వారిని వదిలేసి బీఆర్ఎస్ పార్టీలో చేరాలని కాంగ్రెస్, బీజేపీ నాయకుల ఇళ్లకు తిరగడం ఏంటని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణయ్య ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు రాజకీయ అనుభవం లేకనే ఇలాంటి పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తన వైఖరిలో మార్పు తెచ్చుకొని, పార్టీలో ఉన్న నేతల ఇళ్ల చుట్టూ తిరిగితే మంచిదని హితవు పలికారు. ఎంపీ రంజిత్‌రెడ్డి పుణ్యమా అని విడుదలయిన నిధులతో వెంటనే పనులు ప్రారంభించి, వికారాబాద్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.


వికారాబాద్: క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

ఐటీ పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి కేక్ కట్‌చేసి సంబురాలు చేసుకోగా.. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కార్యాలయంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మొక్కలు నాటారు.

– సాక్షి, నెట్‌వర్క్


తాండూరు టౌన్: బీఆర్ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో


అనంతగిరి: పిల్లలకు నిత్యవసరా సరుకులు అందజేస్తున్న శుభప్రద్‌పటేల్ తదితరులు


కొడంగల్ రూరల్: క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి


వికారాబాద్ అర్బన్: చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

కొండా సేవలు చిరస్మరణీయం

చేవెళ్ల: నిజాం పాలన నుంచి హైదరాబాద్ విముక్తికి స్వర్గీయ కొండా వెంకటరంగారెడ్డి చేసిన కృషి ఎనలేనిదని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన వర్ధంతి ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్‌ను దేశంలో విలీనం చేసేందుకు ఎంతగానో కృషి చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన సేవలకు గుర్తింపుగానే జిల్లాకు రంగారెడ్డి అని పేరు పెట్టినట్లు తెలిపారు.

గుర్తించే వరకు పోరాటం

చేవెళ్ల: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఉద్యమించిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఉద్యమకారుల సంఘం రాష్ట్ర నాయకులు, చేవెళ్ల నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి అంజనేయులు అన్నారు. మండలకేంద్రంలో సోమవారం ఈనెల 30న నిర్వహించే నియోజకవర్గ ఉద్యమకారుల సభ వాల్‌పోస్టర్‌ను పార్లమెంట్ నియోజకవర్గం ఉద్యమకారుల ఫోరం ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి, ఉద్యమకారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన కవి, గాయకుడు సాయిచంద్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు నిర్వహిస్తున్నామని దీనిని విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమ సమయంలో జర్నలిస్టు పాత్ర కీలకమని వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

వీఆర్ఏ వ్యవస్థ శాశ్వతంగా రద్దు

- క్రమబద్ధీకరణకు ప్రభుత్వ నిర్ణయం
- హర్షం వ్యక్తంచేస్తున్న వీఆర్ఏలు


సీఎం చిత్రపటానికి వీఆర్ఏల పాలాభిషేకం..

కొడంగల్ రూరల్: వీఆర్ఏల వ్యవస్థను రద్దుచేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆ విధులు నిర్వర్తిస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ.. వివిధ శాఖలకు కేటాయించాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో వీఆర్ఏలు హర్షం వ్యక్తంచేస్తూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ సహాయకుల జేఏసీ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, తదితరులు మాట్లాడారు. సీఎం కేసీఆర్.. వీఆర్ఏలకు పే స్కేల్ అందించేందుకు చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. వీఆర్ఏల అర్హతను బట్టి పదోన్నతులు కల్పిస్తున్నందుకు తామెంతో రుణపడి ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్ఏ మండల సంఘం నాయకులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించే వరకు సమ్మె


దోమ: బిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు


బొంరాస్‌పేట: సమ్మెలో మాట్లాడుతున్న బస్వరాజ్

అహర్నిశలు పనిచేస్తున్నా గుర్తింపు లేదు: కార్మికులు

దోమ: తమ సమస్యలు పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా వారు సోమవారం మండల కేంద్రంలో ఇంటింటికీ తిరుగుతూ బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. తాము అహర్నిశలు పని చేస్తున్నా గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు కనీస వేతనం అమలు చేసి, తదితర సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె ఆపేదిలేదని చెప్పారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: కార్మికులు చేపట్టిన సమ్మెకు ప్రభుత్వం స్పందించి, వారి సమస్యలు పరిష్కరించాలని బీసీ సంఘం తాలూకా అధ్యక్షుడు మన్నె బస్వరాజ్ డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేసి, ఉద్యగో భద్రత కల్పించే వరకు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో జీపీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నర్సింహులు, సుభాష్, సుధాకర్, మల్లేశ్ యాదవ్, సద్దాం హుస్సేన్, నర్సమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజావాణిలో దరఖాస్తులు నిల్

బంట్వారం: తహసీల్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు రాలేదని బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు శ్రీనివాస్‌రెడ్డి, అప్ఫక్ రసూల్ పేర్కొన్నారు. ధరణికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం


ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

కుల్కచర్ల: ఓటు నమోదు యంత్రాల పనితీరును ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు చెప్పారు. సోమవారం కుల్కచర్ల మండలం తిర్మాలపూర్‌లో ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు ఈవీఎం, వీవీ ప్యాడ్‌లపై ఓటర్లకు అవగాహన ఉండాలని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు, జీపీ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

చదువుపై శ్రద్ధ చూపాలి

ఎంఈఓ చంద్రప్ప


జిన్నారం పాఠశాలలో ఎంఈఓ

బంట్వారం: విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. సోమవారం ఆయన బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో పర్యటించి, పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మొహర్రం


హల్‌సాబ్ పీర్ల మసీద్‌లో ఎంఐఎం నాయకులు

కొడంగల్ రూరల్: కులమతాలకు అతీతంగా జరుపుకొనే పండగ మొహర్రం అని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్ అన్నారు. సోమవారం పట్టణంలోని పీర్ల మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖాతిబ్ ముజిబుర్ రహమాన్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో షేక్ రోమన్, సయ్యద్ ముస్తఫా, ఎండీ.అమీర్, హుస్నే, రమేష్‌నాయక్, ఎండీ. మోహీద్, ఎండీ.వహీద్ పాల్గొన్నారు.

యేటి కాల్వకు గండి


గండి పడడంతో దిగువకు వెళ్తున్న నీరు

బొంరాస్‌పేట: మండల కేంద్రం శివారు చెరువుకు ఏర్పుమళ్ల కాకర్‌వాణి ప్రాజెక్టు నుంచి అలుగు ఉధృతి పెరగడంతో.. చెరువుకు నీరు అందించే యేటికాల్వకు గండిపడింది. వరద పెరిగిన ప్రతిసారి గండి పడుతుందని, మరమ్మతు పనులు సక్రమంగా లేని కారణంగా గండి పడుతున్నట్లు ఆయకట్టు రైతులు ఆరోపించారు. మరమ్మతు పనుల చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యతోనే అభివృద్ధి


దుస్తులు పంపిణీ చేస్తున్న గురునాథ్‌రెడ్డి

కొడంగల్ రూరల్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే క్రమశిక్షణను అలవర్చుకుంటూ, పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ ఉన్నతికి విద్య ఎంతగానో తోడ్పడుతుందని, విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. పాఠశాల ప్రధాన కార్యదర్శి జయతీర్థాచారీ, ప్రధానోపాధ్యాయుడు ఉన్నారు.